తినకుండా బాక్సులో పెట్టుకున్నావేంటి?''.. ఒకరోజు ఉదయం ఆశ్చర్యంగా అన్నది సునీత.

''ఇంటి దగ్గర మా అత్త ఉంటుందమ్మా! ఆమెకు టిఫిన్లంటే చాలా ఇష్టం. నేను పొద్దుటే అన్నం వండే స్తాను, గంజి పోసుకుని తింటాం. మీరు ఇచ్చినవి మా అత్త తింటుందని తీసుకెళ్తాను'' అన్నది తులసి.

ఆ జవాబుకి సునీత తుళ్లిపడింది.

''మీ ఆయన ఏం పని చేస్తాడు?'' తులసిని ఎగా దిగా చూస్తూ అన్నది సునీత.

''మా ఆయన లేడమ్మా! మా పెళ్లయిన రెండో ఏడాది చేపల వేటకు వెళ్లినప్పుడు నీళ్లలో పాము కాటేసి అక్కడికక్కడే పోయాడు. అప్పుడు మా అబ్బాయికి ఏడాది వయసుంటుంది. మా మామగారు కూడా చిన్న వయసులోనే పోయాడట. మా అత్తను, మా అబ్బా యిని పోషించే బాధ్యత నాదేనమ్మా! వాళ్ల కోసమే నాలుగిళ్లల్లో పని చేస్తున్నాను'' అన్నది తులసి.

''తులసీ! మీ అబ్బాయి ఏం చేస్తున్నాడు?'' అన్నాడు పేపర్ మడుస్తూ మాధవ్.

''చదువుకుంటున్నాడు బాబుగారు! వాడికి చదు వంటే బాగా ఇష్టమయ్యా! మా అత్తనేమో.. వాణ్ని పనిలో పెట్టుమంటుంది. కానీ వాడు చదువులు చదవా లని ఆశపడుతున్నాడు. అలా చదవడం మాలాంటోళ్లకి వీలుకాదని వాడికి అర్థం కావడం లేదు'' అన్నది తులసి.

''తులసీ! నాకు టైం అవుతున్నది తొందరగా పని కానివ్వు'' అని టాపిక్ పెంచకుండా తులసిని అక్కడినుంచి పంపించేసింది సునీత.

* * *

ఒక ఆదివారం తులసి ఒక అబ్బాయిని తీసుకుని వచ్చింది. కాలర్ దగ్గర చిరిగిన షర్టు, పొట్టి ప్యాంటు వేసుకుని తులసి పోలికలతో ఉన్నాడు. చూడగానే.. చెప్పకుండానే అర్థమవుతున్నది ఆమె కొడుకని. ఆ అబ్బాయి వాళ్లమ్మకు పనిలో సాయం చేస్తున్నప్పుడు దగ్గరికి రమ్మని పిలిచాడు మాధవ్.

''నీ పేరేంటి బాబూ? ఎక్కడ చదువుకుంటు న్నావు?'' అన్నాడు మాధవ్.

''నా పేరు వేణు అండి. గాంధీ మెమోరియల్ హైస్కూల్లో చదువుకుంటున్నాను'' వినయంగా అన్నాడు వేణు.

''రోహిత్! కాసేపు పుస్తకాల దగ్గర నుంచి లేచి ఇలా వచ్చి వేణుతో ఆడుకో!'' అన్నాడు మాధవ్.

రోహిత్ వచ్చి వేణుని పరిచయం చేసుకున్నాడు. ఇద్దరూ కలిసి కాంపౌండ్ వాల్ బయటికి వెళ్లి మాట్లాడు కుంటున్నారు.

''సునీ! మన తులసి కొడుకు వేసుకున్న ప్యాంటు, షర్టు అసలు బాగాలేవు. చదువుకుంటున్న పిల్లాడు కదా అలాంటివి వేసుకుంటే బాగుండదు. రోహిత్ పాతదు స్తులు కొన్ని ఆ అబ్బాయికివ్వు'' అన్నాడు మాధవ్.

''ఇప్పుడు కాదు లెండి! తర్వాత ఎప్పుడైనా చూస్తాను. రోహిత్‌కి రేపటినుంచి సమ్మెటివ్ ఎసెస్మెంట్స్ ఉన్నాయి. నేను దగ్గరుండి వాణ్ని చదివించాలి. ఏడి వీడు?'' అంటూ బయటికి వచ్చింది సునీత.

కాంపౌండ్ దగ్గర రోహిత్, వేణు నవ్వుతూ మాట్లాడు కోవడం చూడగానే సునీత ముఖం చిట్లించింది.

''రోహిత్! ఇలా రా!''.. పెద్దగా అరిచింది సునీత.

''ఆదివారం కూడా కాసేపైనా వాణ్ని వదలవా? తోటి పిల్లలతో కాలక్షేపం మానసిక ఉల్లాసం కలిగి స్తుంది. చదవనేది ఇష్టంతో చదివితే ఒంటపడుతుంది. బలవంతంగా ఒత్తిడిచేసి కూర్చోబెడితే తలకెక్కదు సునీ! నా మాట విని వాణ్ని వదిలేయ్'' బతిమాలిన ట్లుగా అన్నాడు మాధవ్.

''ఏం చేయాలో నాకు తెలుసు. ఇష్టంతో ఏ పిల్లలూ చదవరు. వెంటపడి కూర్చోబెడితేనే చదువుతారు. అయినా వాడికి పనిమనిషి కొడుకుతో కబుర్లేంటి? నాకు సలహాలివ్వకుండా మీ పని మీరు చూసుకోండి!'' చిరాకుగా ముఖం పెట్టి అన్నది సునీత.

సునీత వెనక.. లోపల పని పూర్తిచేసుకుని వస్తున్న తులసి కనిపించింది. ఆ మాటలన్నీ విన్నదనిపించింది. కానీ ఆమె ముఖంలో కోపతాపాలకు అతీతమైన నిర్వి కారభావం కనిపిస్తున్నది. ఈ పరిస్థితికి కారణం రోహి త్‌ని పిలవడమేనని మాధవ్ బాధపడ్డాడు.

''అమ్మగారు! పనంతా అయిపోయింది. ఇక నేను వెళ్తాను'' అన్నది తులసి.

'సరే!' అన్నట్లుగా తలూపింది సునీత.

సునీత అలా అవమానకరంగా మాట్లాడినప్పుడు ఎదిరించాలనిపించినా.. చెవిటివాడి ముందు శంఖం ఊదినట్లేనని మౌనంగా అక్కడినుంచి వెళ్లిపోయాడు మాధవ్. రోహిత్ అయిష్టంగానే వేణుకి బై చెప్పి లోప లికి వచ్చి పుస్తకాలు తీశాడు.

* * *

వార్షిక పరీక్షలు వచ్చేశాయి. సునీత తను టెన్షన్ పడుతూ రోహిత్‌ను కూడా టెన్షన్ పెడుతున్నది. తెల్ల వారుజామున లేచిన దగ్గర నుంచి అర్ధరాత్రి పడు కునే వరకు రోహిత్ పుస్తకాలతో కుస్తీ పడుతున్నాడు అనడం కన్నా.. సునీత పట్టిస్తున్నది అనడం సబబు. ఎట్టకేలకు పరీక్షలు పూర్తయ్యాయి. 'హమ్మయ్యా!' అంటూ ఇద్దరూ ఊపిరి తీసుకున్నారు. ఆ తర్వాత ఫలితాల కోసం ఎదురుచూస్తున్నది సునీత. ఆ రోజు కూడా వచ్చేసింది.

* * *

''అమ్మగారు! ఈ రోజు పదవ తరగతి పాసు, ఫేలు ఫోనుల్లో తెలుస్తుందని అందరూ అంటున్నారు. నిజమేనా అండి?''.. కంప్యూటర్ ఉన్న గది గుమ్మం బయట నిలబడి చేతుల తడి కొంగుకి తుడుచుకుంటూ అన్నది తులసి.

''ఆ.. అవును నిజమే! అయినా అవి నీకెందుకు? అంట్లు తోమడం పూర్తయితే ఇల్లంతా శుభ్రంగా సర్దు కురా. గుడ్డ తీసుకుని కిటికీల అద్దాలు మరకలు లేకుండా తుడువు. ఎక్కడా కొంచెం దుమ్ము కూడా కనిపించకూడదు'' ముఖం చిట్లించి అన్నది సునీత.

''ఎక్కడా దుమ్ము లేదమ్మగారు! మొన్నేగా శుభ్రంగా తుడిచాను. ఇంటికి ఎవరైనా చుట్టాలు వస్తున్నారామ్మా?'' అన్నది తులసి.

''చుట్టాలు రావడం లేదు. ఇవ్వాళ బాబు పరీక్ష ఫలితాలు తెలుస్తాయి. వాడు స్కూల్ ఫస్ట్ వస్తాడు. సాయంత్రం ఆఫీసు వాళ్లకి పార్టీ




**'నమస్తే తెలంగాణ, ముల్కనూరు సాహితీపీఠం' సంయుక్తంగా నిర్వహించిన 'కథల పోటీ-2023/24'లో రూ.5 వేల బహుమతి పొందిన కథ.**